


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 07-08-2026 సంపుటి : 08 సంచిక 54 పేజీలు : 8 వెల : రూ 3-00


# చేనేతలకు అండగా ప్రజా ప్రభుత్వం



**నేతన్న సేవలో పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు**

**జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిధులు విడుదల చేయనున్న సీఎం**

**రూ.179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి**

**నేతన్న కుటుంబాలతో ముఖాముఖి కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, ఆగస్టు 6 :- నేతన్నల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఉచిత విద్యుత్, రాయితీలు, 50 ఏళ్లకే పింఛన్ అందిస్తూ దన్నుగా ఉంటోన్న ప్రభుత్వం... తాజాగా వారి సంక్షేమానికి మరో అడుగు ముందుకేసింది. నేతన్న సేవలో పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. 7వ తేదీన '12వ జాతీయ చేనేత దినోత్సవం'ను పురస్కరించుకుని 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పథకంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25 వేల సాయం దక్కనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లను ప్రభుత్వం అందించనుంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరిరక్షించే లక్ష్యంతో సర్కారు సాయం అందిస్తోంది.

చేనేత రంగం బలోపేతం దిశగా..

.తాజాగా ప్రవేశపెడుతోన్న నేతన్న సేవలో పథకమే కాకుండా ఇప్పటికే అనేక విధాలుగా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కల్పిస్తోంది. దీనికి ఏటా రూ.150 కోట్లు ఖర్చు కానుంది. అంతేకాకుండా 50 ఏళ్లు నిండిన 85 వేల మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుతో పాటు అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా ఏర్పాటు చేస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలుచీరాల నియోజకవర్గంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి 10.50 గంటలకు చేరుకుంటారు. 11.05 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు జాండ్రపేటలో చేనేతల వర్క్‌షాప్‌లో లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. కొత్తపేటలో 04.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

# గోబర్ధన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం



ఢిల్లీ, ఆగస్టు 6 ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. గోబర్ధన్ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.23,731 కోట్లతో బయో గ్యాస్ పంపిణీ చేయడం కోసం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. అసోంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకుగ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.8,970 కోట్లతో అసోంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

# దేశంలోనే తొలిసారి.. ఏపీ హస్తకళలకు 'క్యూఆర్ కోడ్'



అమరావతి, ఆగస్టు 6: ఏపీ హస్తకళలకు సాంకేతికతను జోడిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు దేశంలో తొలిసారిగా హస్తకళా ఉత్పత్తులకు క్యూఆర్ కోడ్(ఖీఖీ అనీటవ) విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. 'లేపాక్షి' ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూఆర్ కోడ్ వ్యవస్థను ప్రారంభించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆయా కళాఖండానికి సంబంధించిన పూర్తి వివరాలు క్షణాల్లో అందుబాటులోకి రానున్నాయి. కళాఖండం చరిత్ర, సాంస్కృతిక విశిష్టత, దానిని రూపొందించిన కళాకారుడి పేరు, నైపుణ్యం, తయారీ విధానం క్యూఆర్ కోడ్‌లో రానున్నాయి.అలాగే ముడిసరుకు, తయారీ సమయం, వస్తువు కొలతలు కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. జీఐట్యాగ్, 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి'కి సంబంధించిన వివరాలు కూడా క్యూఆర్ కోడ్ ద్వారా అందుబాటులో ఉంటాయి. మొదటి దశలో రాష్ట్రంలోని ఎనిమిది ఐకానిక్ హస్తకళా ఉత్పత్తులకు ఈ క్యూఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తున్నారు. బొబ్బిలి వీణ, కలంకారి పెయింటింగ్స్, సవర ఆదివాసి పెయింటింగ్స్ వంటి ప్రముఖ హస్తకళా ఉత్పత్తులకు డిజిటల్ ప్రొఫైల్‌ను రూపొందించారు.త్వరలోనే అన్ని హస్తకళా ఉత్పత్తులకు క్యూఆర్ కోడ్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ విధానం ద్వారా నకిలీ హస్తకళా ఉత్పత్తులకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ మార్కెట్‌లో ఏపీ హస్తకళలకు మరింత ఆదరణ పెరగడం, కళాకారులకు సరైన గుర్తింపు, మెరుగైన ఆదాయం లభించడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్యూఆర్ కోడ్ విధానంతో రాష్ట్ర హస్తకళలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది.

# విమాన ఇంధనంలో ఇథనాల్ కలపడం లేదు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు..

న్యూఢిల్లీ: విమాన ఇంధనం లో ఇథనాల్ కలిపే ప్రసక్తే లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తేల్చి చెప్పారు. ఇథనాల్ కలుపుతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల్లో అనవసర ఆందోళనలు కలిగించేలా బాధ్యతారాహిత్యంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. విమాన ఇంధనంలో ఇథనాల్ బ్లెండింగ్ చేపడుతున్నారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.ఇథనాల్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ూంఈ) పూర్తిగా వేరని, రెండింటికి ఎలాంటి సంబంధం లేదని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఇథనాల్‌ను విమాన ఇంధనంగా ఉపయోగించడం లేదని, ఎస్ఏఎఫ్ అనేది అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా తయారుచేసే ప్రత్యామ్నాయ విమాన ఇంధనమని వివరించారు. ప్రయాణికుల భద్రతే కేంద్ర ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని రామ్మోహన్ నాయుడు పునరుద్ఘాటించారు. విమానయాన భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అన్ని నిర్ణయాలు అత్యున్నత భద్రతా ప్రమాణాల మేరకే తీసుకుంటామని చెప్పారు.ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ కూడా కీలక ప్రకటన విడుదల చేసింది. విమాన ఇంధనంలో ఇథనాల్ కలుపుతున్నారనే ప్రచారాన్ని ఆ శాఖ ఖండించింది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఎఅయా) ఆమోదించిన కఠినమైన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగానే సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ ఉందని పేర్కొంది. విమానయాన భద్రతకు సంబంధించిన అంశాలపై నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, అసత్య ప్రచారాలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేసింది.

# టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులు వెంటనే చేరాలి

**--అన్ని సౌకర్యాలు కల్పించాం భూమా అఖిలప్రియ ఎమ్మెల్యే**



-- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6:నంద్యాల పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణాలు, మౌలిక వసతులు, లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత ప్రక్రియపై గురువారం టిడ్కో ఎండీ బి. సునీల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. టిడ్కో కాలనీలో నిర్మించిన గృహాలను సందర్శించి, రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్, వీధి దీపాలు, పారిశుధ్యం, మురుగు నీటి పారుదల, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. కాలనీలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా టిడ్కో ఎండీ బి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మిగిలిన చిన్నచిన్న పనులను సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో టిడ్కో అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, టిడ్కో గృహాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా తమ ఇళ్లలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ఈ గృహాలను నిర్మించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇళ్లలో నివాసం ప్రారంభించే లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి లోటు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రతి అర్హ కుటుంబానికి గృహాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ మర్రియన్న, ఎస్ఈ ఆదినారాయణ, టిడ్కో ప్రాజెక్టు అధికారి గుప్తా, మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, మున్సిపల్ ఇంజనీర్ నాగభూషణం రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణి బాయి, డీఈలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాయలసీమకు నీటి విడుదలకు స్వాగతం--

**ప్రభుత్వానికి సాగునీటి సాధన సమితి కృతజ్ఞతలు--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6:శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా రాయలసీమకు కృష్ణా జలాల విడుదల ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్వాగతించింది.గురువారం నంద్యాలలో సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ, తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. రాయలసీమ జలహక్కులను కాపాడుతూ నీటి విడుదల కొనసాగించాలని, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, గుండ్రేవుల ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాయలసీమ జలహక్కుల పరిరక్షణ కోసం సమితి ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.






# సంపాదకీయం

శుక్రవారం 07-08-2026

## రిజర్వేషన్లు లేని సమాజం సాధ్యమా..

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్ననుంచి తప్పించుకోవచ్చు. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకి చూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టు గా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు. ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతులను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది.నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గది ఉందా, తల్లిదండ్రుల విద్యా స్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కనిపించినట్లు నటించడం; అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం; ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో, సమాజంలోని అన్నివర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తననుతాను చూసుకునే అద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది. అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీకాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు. అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆ షరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మగౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతే సమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం.రిజర్వేషన్లపట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన బిజెపి రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు.

## ఇండియా-నేపాల్ సరిహద్దులో ఉద్రిక్తత..

### భారత సిబ్బందిపై రాళ్లదాడి చేసిన నేపాలీలు

ఇండియా-నేపాల్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినట్లు ఆలస్యంగా వెల్లడైంది. సరిహద్దులో భద్రతా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌బీ (సశస్త్ర సీమా బల్)కు చెందిన సిబ్బందిపై నేపాల్‌కు చెందిన కొందరు గ్రామీణులు రాళ్ల దాడి చేశారు. ఈ ఘటన ఆగష్టు 2న జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. ఇండియా-నేపాల్



సరిహద్దు అయిన బిహార్‌లోని వెస్ట్ చంపారన్ వద్ద ఎస్ఎస్‌బీ సిబ్బంది, ఉన్నతాధికారులు భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. జూలై 31న సరిహద్దులో నేపాల్ వైపు ఉన్న సుస్తా గ్రామస్తులు మట్టితో ఒక నిర్మాణం చేపట్టారుఅయితే, అది నేపాల్ వైపు నుంచి ఇండియాలోకి వచ్చింది. అంటే, ఇండియా భూభాగంలో ఆ నిర్మాణం చేపట్టారు. దీనిపై ఎస్ఎస్‌బీ దళాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఈ అంశంపై ఇటు భారత సిబ్బంది, అటు నేపాల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ కలిసి చర్చించి, ఒక ఒప్పందానికి వచ్చారు. ఆ నిర్మాణాన్ని ఆపేయాలని నిర్ణయించారు. అయితే, అక్కడ ఏ నిర్మాణం చేపట్టకూడదనే ఒప్పందం ఉన్నప్పటికీ, మళ్లీ కొందరు నేపాల్ గ్రామస్తులు ఆగష్టు 2న తిరిగి నిర్మాణం ప్రారంభించారు. దీన్ని ఎస్ఎస్‌బీకి చెందిన భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో నేపాల్‌కు చెందిన గ్రామస్తులు భారత సిబ్బందిపైకి రాళ్లు రువ్వారు. దాదాపు 150 నుంచి 200 మంది గ్రామస్తులు కలిసి భారత సిబ్బందిపైకి రాళ్లు, కర్రలతో దాడికి యత్నించారు.ఈ నేపథ్యంలో నేపాల్ గ్రామస్తులపై ఎస్ఎస్‌బీ, రాంపూర్వ, 21వ బెటాలియన్ కమాండర్‌కు చెందిన ఉన్నతాధికారి అవ్దేష్ కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమపై నేపాల్ గ్రామస్తులు దాడికి దిగారని ఆరోపిస్తూ వాల్మీకి నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## కేసీఆర్ పోరాటం జయశంకర్ సారు ఆరాటం వల్లే తెలంగాణ వచ్చింది : హరీశ్ రావు

సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేది? తెలంగాణ వచ్చింది అంటే కేసీఆర్ పోరాటం జయశంకర్ సారు ఆరాటం వల్ల వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఆయన విగ్రహానికి హరీశ్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజు కూడా జై తెలంగాణ అనలేదు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నాడు. గోదావరిలో 380 ఎఓఅ ల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించాం. 968 ఎఓఅ గోదావరి నదీ జలాలలో మన హక్కుగా రావలసింది అని పోరాటం చేశారు. కేసీఆర్ గోదావరిలో 830 ఎఓఅ నీళ్లు హక్కుగా సాధించారు. కేసీఆర్ మిగతా 130 ఎఓఅ ల నీళ్ల కోసంలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాలు అయినా ఒక్క అనుమతి కూడా తీసుకురాలేదన్నారు.చరిత్రలో అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలని రివ్యూ చేయాలని మొదటిసారి వచ్చింది. గతంలో 18 వరకు మీటింగులు అయ్యాయి ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల పునర్ సమీక్షించాలని తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎప్పుడూ రాలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను ఎప్పుడు వ్యతిరేకించినా తెలంగాణ దాన్ని తిప్పి కొట్టింది.. అన్ని అనుమతులు సాధించింది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటిసారి ఎజెండాలోకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వానికి ప్రాజెక్టుల మీద నీళ్ల మీద సోయి లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఎజెండా మార్పించాలని హరీశ్ రావు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మీటింగ్‌ను బహిష్కరించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడుతున్న బనకచర్లను ఎందుకు తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోలేక పోతుంది.సమ్మక్క సారక్క ప్రాజెక్ట్ 47 ఎఓఅ హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక తెలంగాణ ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుంది అనేది తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నాఖీఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరం. వరంగల్ నల్గొండ ప్రాంతాలకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్టును ఎందుకు వదులుకుంటున్నారని ప్రశ్నించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు కట్టే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఆనాడు ఎజెండాలో లేదన్నారు..ఢిల్లీలో జరిగే మీటింగ్ లో ఉంది..మీటింగుకు హాజరు కాము అన్నారు?హాజరయ్యారు.. సంతకం పెట్టా అన్నారు సీఎం..కోర్టులో కేసులు వేసి అట్టర్ ఫ్లాప్ అయ్యారు.. కోర్టులో రిట్ కేస్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి వెయ్యడానికి రావడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు.

## తమిళనాడులో మళ్లీ 'తమిళ్ తాయ్ వాళ్తు' వివాదం..

### గవర్నర్‌కు 21 మంది ఎంపీల లేఖ

తమిళనాడులో రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలాపన ప్రొటోకాల్ మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. తిరునెల్వేలిలో జరిగిన మనోన్మణీయం సుందరనార్ యూనివర్సిటీ 33వ కాన్వకేషన్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని ఎంపీలు ఆరోపించారు. కార్యక్రమంలో ముందుగా 'వందే మాతరం', అనంతరం జాతీయ గీతం, ఆ తర్వాత మూడో స్థానంలో 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలపించడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర గీతాన్ని ఈ విధంగా మూడో స్థానంలో ఉంచడం తమిళ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా.. ఆ గీత రచయిత సుందరనార్‌ను కూడా అవమానించడమేనని లేఖలో పేర్కొన్నారు.ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం, ఎంపీ కార్తి చిదంబరం, చిరుతైగల్ కచ్చి నేత తిరుమావలవన్‌తో పాటు మొత్తం 21 మంది ఎంపీలు గవర్నర్‌కు సంయుక్తంగా లేఖ రాశారు. గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం.. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో ప్రారంభంలో 'తమిళ్ తాయ్ వాళ్తు', ముగింపులో జాతీయ గీతం ఆలపించాలని వారు డిమాండ్ చేశారు. వరుసగా మూడోసారి ప్రొటోకాల్‌లో మార్పులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావులేకుండా రాజ్‌భవన్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీలు విజ్ఞప్తి చేశారు.





## విడాకులిచ్చే అధికారం మతపరమైన సంస్థలకు లేదు.. తేల్చి చెప్పిన మధ్యప్రదేశ్ హైకోర్టు..



న్యూఢిల్లీ: మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్-దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది.అయితే, విడాకులు కోరే వ్యక్తికి చట్టప్రకారం సంబంధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకులు పొందే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహ రద్దు పిటిషన్ దాఖలు చేస్తే, దానిని సంబంధిత కోర్టు నిబంధనల ప్రకారం విచారిస్తుందని పేర్కొంది. కాగా, ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు ప్రక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


## అత్యాచారం కేసు.. తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు..



తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడింది. 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అతడు రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది.2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు తాజాగా శిక్షను ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో అతడిని అరెస్ట్ చేశారు.విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిందికాగా, ఈ కేసులో తానే బాధితుడినని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తాను నిర్దోషినని పేర్కొంటూ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని వెల్లడించారు. తీర్పు వెలువడిన అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్‌పాల్, 'నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ తీర్పుతో నేను ఏకీభవించడం లేదు. న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాను' అని చెప్పారు.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో మళ్లీ భూకంపం

ఇటానగర్, ఆగస్టు 06: అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కెల్‌పై దాని తీవ్రత 5.1గా నమోదయింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ జరగలేదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. ఈ రోజు తెల్లవారుజాము 5.45 గంటలకు అప్పర సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలో మీటర్ల దూరంలో.. 11 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది.అయితే ఈ భూకంపానికి ముందు మూడు చిన్న ప్రకంపనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. అవి ఉదయం 3.40 గంటలకు 5 కిలోమీటర్ల లోతులో 2.8 తీవ్రతతో ఒకటి.. దీని తర్వాత 3.55 గంటలకు 3.2 తీవ్రతతో మరొకటి వచ్చిందని వివరించింది. అలాగే




ఉదయం 4.34 గంటలకు 2.8 తీవ్రతో ఇంకొకటి వచ్చిందని తెలిపింది. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.మరోవైపు ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం భూకంపం సంభవించింది. ఇది 5.0 తీవ్రతతో వచ్చింది. ఈ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. ఇక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. దేశంలోని ఈశాన్య ప్రాంతం భూకంపం జోన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో తరచూ అత్యధికంగా భూ ప్రకంపనలు జరుగుతున్నాయి.

## చింతలపూడిలో కుంకుమపువ్వు సాగు

ఏలూరు, ఆగస్టు 6 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కుంకుమ పువ్వు సాగు చేయాలని నిర్ణయించింది. కుంకుమ పువ్వు సాగుకు సంబంధించి చేసిన ప్రయోగాలు విజయవంతం కావడంతో సాగు దిశగా చర్యలు తీసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగు చేయాలని ప్లాన్ చేశారు. అనుమతులన్నీ రాగానే కుంకుమ పువ్వును సాగు చేసేందుకు 30 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుంకుమ పువ్వు సాగు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో ప్రయోగాత్మకంగా సాగు చేయగా మంచి ఫలితాలు రావడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి కేంద్రంగా కుంకుమ పువ్వు సాగు చేయనున్నారు. ఏపీ ప్రభుత్వం 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగుకు కేటాయించాలని భావిస్తోంది. వాస్తవానికి ముందు లంగసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగు చేద్దామని భావించారు.. కానీ అక్కడ అనువైన భూమి లేకపోవడంతో చింతపల్లిలో సాగు చేయాలని నిర్ణయించారు. చింతపల్లిలో కుంకు పువ్వు సాగుకు సంబంధించి శాస్త్రవేత్తలు రెండేళ్లుగా చేస్తున్న ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. ఈ ప్రాంతంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో మూడు వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. చింతపల్లిలో కుంకుమ పువ్వు సాగుకు.. కృష్ణా జిల్లాకు చెందిన 'స్నాప్ గ్రీన్‌మ్యాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ముందకు వచ్చింది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కూడా చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఏపీ ప్రభుత్వం కుంకుమ పువ్వు సాగు కోసం కేటాయించే 30 ఎకరాల్లో.. 18 ఎకరాల్లో సాగు ఉంటుంది, 3 ఎకరాల్లో ఇండోర్ పర్యావరణ పరిరక్షణ, మిగిలిన 9 ఎకరాల్లో ప్రాసెసింగ్, పరిశోధన, శిక్షణ, పరిపాలనా భవనాలు వంటి వాటి కోసం కేటాయించారు. కుంకుమ పువ్వు సాగు పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసిన వారికి కూడా మంచి అనుభవం ఉంది అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని చింతపల్లిలో కుంకుమపువ్వు సాగుకు అడుగులు వేస్తోంది. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సుగంధ ద్రవ్య బోర్డు, సేంద్రీయ ధృవీకరణ, ఉద్యానవన శాఖ నుంచి అనుమతులు రాగానే భూమిని అధికారికంగా కేటాయిస్తారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్? వంటి చల్లని ప్రాంతాల్లో ఎక్కువగా కుంకుమ పువ్వు సాగు చేస్తున్నారు. మనకు 100 టన్నుల డిమాండ్ ఉంటే.. దేశీయంగా కేవలం 3.46 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి 300 టన్నులు ఉంటే.. ఇరాన్?, స్పెయిన్ దేశాలు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి.

## తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్

విజయవాడ, ఆగస్టు 6 ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది. ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి. ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.. వీరంతా ఎటు పోయారనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఉపాధి, విద్య, వ్యాపార రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా ఇతర నగరాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు క్షేత్రస్థాయి రీ-వెరిఫికేషన్ సమయంలో లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయ నష్ట కోణంలో చూస్తే, ఈ ఓట్ల గల్లంతు ప్రభావం రెండు ప్రధాన పార్టీలపై పడే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ సొంత ఊళ్లకు వచ్చి ఓటేసే మైగ్రెంట్ ఓటర్లు వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీ మద్దతుదారులనే లెక్కలు పార్టీల వద్ద ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తమ మద్దతుదారుల పేర్లు పొరపాటున ఈ 44 లక్షల జాబితాలో చేరాయేమోనని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల వేళ ఈ ఓట్ల వ్యత్యాసం గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంది. ఎన్నికల సంఘం, సీఈఓ వివేక్ యాదవ్ స్పష్టం చేసిన దాని ప్రకారం, ఇది కేవలం ముసాయిదా మాత్రమే. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు హక్కునూ నోటీసు, విచారణ లేకుండా తొలగించబోమని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు నెల అంతా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నడుస్తోంది. తమ పేరు పొరపాటున గల్లంతైతే ఫారమ్-6 సమర్పించి, సరైన ఆధారాలు చూపిస్తే అక్టోబర్ 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేరుతుందని ఈసీ వెల్లడించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో గ్రామీణ మరియు పట్టణ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేసిన కూటమి, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి నియోజకవర్గంలో రద్దయిన ఓట్ల జాబితాను రీ-వెరిఫై చేసే పనిలో పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదే అయినందున, అసలైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూసేందుకు పొలిటికల్ పార్టీలు డిజిటల్ క్యాంపెయిన్లు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్లను ముమ్మరం చేశాయి.

## రాజమండ్రిలో మెడికల్ విద్యార్థినిపై కారు ఎక్కించిన దారుణం

రాజమండ్రి ఏవీ అప్పారావు రోడ్డు ప్రసాదిత్యా మాల్ వద్ద పార్కింగ్ వివాదంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రియాంక (28)పై నామవరానికి చెందిన ఇద్దరు యువకులు కారు ఎక్కించారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు హైదరాబాద్ ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ కాగా, మద్యం మత్తులో ఈ దారుణానికి పాల్పడిన నిందితులను ప్రకాష్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఐఎన్ఎస్ డేగ ఇక జ్ఞాపకమేనా !!

విశాఖపట్టణం, ఆగస్టు 6,ఆరు దశాబ్దాలకు పైగా విశాఖపట్నానికి విమానంలో వచ్చిన ప్రతి ప్రయాణికుడూ సాధారణ విమానాశ్రయంలో దిగలేదు... భారత నౌకాదళ వైమానిక స్థావరంలోనే అడుగుపెట్టాడు. మీ విమానం ల్యాండ్ అయిన అదే రన్‌వేపై ప్రతి ఉదయం హాక్ జెట్ శిక్షణ విమానాలు గర్జిస్తూ ఆకాశంలోకి దూసుకెళ్లేవి. టెర్మినల్ పక్కనే జలాంతర్గాములను వేటాడే హెలికాప్టర్లు నిలిపిన హ్యాంగర్లు కనిపించేవి. పౌర విమానాలు, యుద్ధ విమానాలు... రెండూ ఒకే రన్‌వేను పంచుకోవడం విశాఖకు మాత్రమే ప్రత్యేకమైన దృశ్యం. "విశాఖ అంటే అంతే" అన్నట్టే వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ సాగాయి. ఆగస్టు 1, 2026న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని" ప్రారంభించారు. ఆగస్టు 17నుంచి అన్ని కమర్షియల్ విమాన సర్వీసులు అక్కడికి మారనున్నాయి. దీంతో ఆరు దశాబ్దాలుగా ప్రయాణికులను ఆహ్వానించిన ఐఎన్ఎస్ డేగా ఇకపై పూర్తిగా నావికాదళ విమాన స్థావరంగానే కొనసాగనుంది. ఈ సందర్భంగా ఒక ప్రశ్న సహజంగానే వస్తుంది. ఐఎన్ఎస్ డేగా కథ ఎక్కడ మొదలైంది? ఇప్పుడు దాని భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?యుద్ధ అవసరాల కోసం నిర్మించిన రన్‌వే... తర్వాత నౌకాదళ గూటిగా మారిందిఏఔా డేగా చరిత్ర భారత నౌకాదళంతో కాదు... రెండో ప్రపంచ యుద్ధంతో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో భారత తూర్పు తీరంలో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా రాయల్ ఎయిర్ ఫోర్స్ నావల్ ఆర్మమెంట్ డిపో సమీపంలో ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించింది. యుద్ధం ముగిసిన తర్వాత ఆ రన్‌వే దాదాపు నిరుపయోగంగా మారిపోయింది. 1962లో పౌర విమానాల కోసం మళ్లీ తెరిచినా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో సేవలు పలుమార్లు నిలిచిపోయాయి. భారత నౌకాదళం తన వైమానిక విభాగాన్ని విస్తరించే క్రమంలో 1972 డిసెంబరులో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించింది. తొలుత ఏఔా సర్కార్స్ నుంచి హెలికాప్టర్ యూనిట్‌ను నడిపింది. నాలుగేళ్లలో పౌర విమానాశ్రయం పక్కనే హెలిప్యాడ్లు, హ్యాంగర్లు ఏర్పడ్డాయి. 1986లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖ విమానాశ్రయాన్ని అధికారికంగా భారత నౌకాదళానికి అప్పగించింది. భారత పౌర విమానయాన చరిత్రలో ఇది అత్యంత అరుదైన నమూనా. సాధారణంగా సైనిక స్థావరాల్లో పౌర విమానాల కోసం చిన్న ఎన్‌క్లేవ్ ఉంటుంది. విశాఖలో మాత్రం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం నావికాదళ స్థావరం లోపలే నడిచింది. 1991 అక్టోబర్ 21న వైస్ అడ్మిరల్ లక్ష్మీనారాయణ రామ్‌దాస్ దీనిని అధికారికంగా "ఐఎన్ఎస్ డేగా" గా ప్రారంభించారు. డేగా" అంటే మనకు తెలిసిన గద్ద జాతి పక్షే. శక్తి, వేగానికి ప్రతీకగా నిలిచే ఆ పేరు... తర్వాతి కాలంలో హాక్ జెట్లు, కామోవ్ హెలికాప్టర్లు, నిఘా విమానాలకు కేంద్రంగా ఎదిగి ఈ స్థావరానికి సరిగ్గా సరిపోయింది. 2000ల దశకం ఐఎన్ఎస్ డేగా రూపురేఖలనే మార్చేసింది. 2007లో 10 వేల అడుగుల కొత్త రన్‌వే అందుబాటులోకి వచ్చింది. వెంటనే రాత్రి వేళల్లో కూడా విమాన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గోవా నుంచి కామోవ్ హెలికాప్టర్లతో కూడిన ఐఎన్ఏఎస్-333 "ఈగిల్స్", తర్వాత హాక్ జెట్ శిక్షణ విమానాలతో ఏఔా-551 "ది ఫాంటమ్స్" ఇక్కడికి వచ్చాయి. 2009 నాటికి ఐదు నౌకాదళ స్క్వాడ్రన్లు, యుద్ధ నౌకల విమాన యూనిట్లు, నెలకు 550కుపైగా కమర్షియల్ విమానాలు... అన్నీ ఒకే రన్‌వేను పంచుకునే స్థాయికి ఐఎన్ఎస్ డేగా చేరుకుంది. విశాఖ ప్రజలకు ఇది రోజువారీ జీవితంలో భాగమైపోయింది. పైన హాక్ జెట్ గర్జిస్తే అది సాధారణ దృశ్యమే. కానీ ఏఔా డేగా కేవలం విమానాశ్రయం మాత్రమే కాదు. ప్రతి ఏడాది బంగాళాఖాతంలో విరుచుకుపడే తుపాన్లు, వరదల సమయంలో సహాయక చర్యల్లో ముందుండేది. తూర్పు నౌకాదళ కమాండ్ అడ్వెంచర్, స్కైడైవింగ్ కార్యక్రమాలకు కూడా ఇదే కేంద్రంగా నిలిచింది. ఈ ద్వంద్వ వినియోగ వ్యవస్థ విశాఖకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. అయితే అదే కాలక్రమంలో దాని బలహీనతగా కూడా మారింది. మూడు వైపులా కొండలు ఉండటంతో విమానాలు ఒకే దిశలో టేకాఫ్, ల్యాండింగ్ చేయాల్సి వచ్చేది. గంటకు దాదాపు పది విమానాలకే పరిమితి. అదీ కాక పౌర విమానాల షెడ్యూల్ మొత్తం నౌకాదళ శిక్షణ సమయాలకు అనుగుణంగానే ఉండేది. ఇంతలో విశాఖ నగరం విస్తరించింది. ఉక్కు పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు ఆధారిత పెట్టుబడులతో దేశంలో వేగంగా ఎదుగుతున్న నగరంగా మారింది. 1990ల అవసరాలకు సరిపోయే విమానాశ్రయం... 2020ల విశాఖ అవసరాలకు సరిపోలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన భోగాపురం విమానాశ్రయం చివరకు సాకారమైంది. సుమారు ?4,700 నుంచి ?5,600 కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మించిన "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం", విశాఖకు ఈశాన్యంగా విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో సిద్ధమైంది. 3,800 మీటర్ల రన్‌వేతో భారీ వైడ్‌బాడీ విమానాలు దిగే సామర్థ్యం దీనికి ఉంది. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా, భవిష్యత్తులో నాలుగు కోట్ల వరకు విస్తరించేలా దీన్ని రూపకల్పన చేశారు. డీజీసీఏ లైసెన్స్, బీసీఏఎస్ భద్రతా అనుమతులు, అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ హోదా... అన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 17 నుంచి దేశీయ, అంతర్జాతీయ కమర్షియల్ విమానాలన్నీ భోగాపురం నుంచే నడవనున్నాయి. విశాఖకు చిరునామాగా ఉన్న"ఋజి" ఐఏటీఏ కోడ్ కూడా అక్కడికే మారుతుంది. ఈ మార్పుతో మూతపడేది పౌర ప్రయాణికుల టెర్మినల్ మాత్రమే. నావికాదళ స్థావరం మాత్రం యథావిధిగా కొనసాగుతుంది. సైనిక విమానాలు, నౌకాదళ కార్యకలాపాలు, విపత్తు సహాయక చర్యలు, ప్రభుత్వ ప్రత్యేక విమానాలు, వీఐపీ రాకపోకలు... అన్నింటికీ ఐఎన్ఎస్ డేగా సేవలందిస్తూనే ఉంటుంది. అంతేకాదు, కమర్షియల్ విమానాల ఒత్తిడి తొలగిపోవడంతో విశాఖ గగనతలంపై భారత నౌకాదళానికి పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఇప్పటి వరకు పౌర విమానాల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని చేయాల్సి వచ్చిన అడ్జస్ట్మెంట్లు ఇక అవసరం ఉండవు. శిక్షణ విమానాలు పెంచడం, నౌకాదళ కార్యకలాపాలను విస్తరించడం, అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగంగా స్పందించడం... ఇవన్నీ మరింత సులభమవుతాయి. ఐఎన్ఎస్ డేగా ఎప్పుడూ శాశ్వత పౌర విమానాశ్రయంగా లేదు. భౌగోళిక పరిస్థితులు, కాలానుగుణ అవసరాలు కలిసి తాత్కాలిక ఏర్పాటుగా మొదలైన వ్యవస్థ... మూడు దశాబ్దాలకు పైగా విశాఖ నగరానికి సేవలందించింది. దాని వల్ల విశాఖ దేశవ్యాప్తంగా మెరుగైన వైమానిక అనుసంధానం పొందింది. అదే సమయంలో పరిమిత సామర్థ్యం, యుద్ధ విమానాలతో రన్‌వే పంచుకోవాల్సిన పరిస్థితిని కూడా భరించింది. ఇప్పుడు ఆ రెండు పాత్రలు విడిపోతున్నాయి. విశాఖకు ప్రపంచస్థాయి అంతర్జాతీయ విమానాశ్రయం లభిస్తోంది. ఐఎన్ఎస్ డేగా మాత్రం తన అసలు స్వరూపానికి తిరిగి వెళ్తోంది... తూర్పు నౌకాదళానికి పూర్తిస్థాయి వైమానిక కేంద్రంగా. ఇకపై ఆ పాత రన్‌వేపై హాక్ జెట్ గర్జిస్తూ ఆకాశంలోకి ఎగిరినప్పుడు... దాని వెనుక టేకాఫ్ కోసం బోయింగ్-737 విమానాల వరుస కనిపించదు అంతే

# వారసుడిగా విమర్శలు - లోకేష్ పనితీరుపై పొగడ్తలు



విజయనగరం, ఆగస్టు 6, విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ముగించుకుని తిరుగుపయనమైన సందర్భంలో.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భుజం తట్టి "శభాష్ లోకేశ్! చాలా బాగా పనిచేస్తున్నావు.. ఇదే వేగం, స్ఫూర్తితో ముందడుగు వేయి" అని అభినందించడం కేవలం ఒక సాధారణ వీడ్కోలు మర్యాద మాత్రమే కాదు. భారత రాజకీయాల్లో సీనియర్ నేతల గుర్తింపు పొందడం అంత సులభం కాని తరుణంలో, ప్రధాని స్థాయిలో లభించిన ఈ ఆత్మీయ ప్రశంసా వాక్యాలు నారా లోకేశ్ పాలనా నైపుణ్యానికి, క్రమశిక్షణతో కూడిన పట్టుదలకు దక్కిన జాతీయ స్థాయి ముద్రగా చెప్పుకోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన ప్రారంభంలో లోకేశ్ తీవ్ర ప్రతికూల విమర్శలను, సోషల్ మీడియా ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. వారసత్వం అనే నైతిక బరువుతో ప్రయాణం ప్రారంభించిన ఆయన, విమర్శలను ఎదురుదాడికి సాకుగా మార్చుకోకుండా పరిపాలనా సామర్థ్యం, పక్కా కార్పొరేట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో తనను తాను మలచుకున్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి చొచ్చుకెళ్లడం, మంగళగిరి నియోజకవర్గంలో రికార్డు విజయం సాధించడమే కాకుండా.. కార్నెగీ మెల్లన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల విద్యాభ్యాసం అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో సమర్థవంతంగా వినియోగిస్తూ ఒక ప్రొఫెషనల్ లీడర్‌గా ఎదిగారు. విజయనగరం భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం, యోగాంధ్ర ప్రపంచ రికార్డు కార్యక్రమాల నిర్వహణ, లేదా గతంలో ప్రధాని మోదీ ఏపీ పర్యటనల సమన్వయం ఇలా ప్రతి ఈవెంట్‌లోనూ లోకేశ్ చూపించిన ఆర్గనైజింగ్ స్కిల్స్ ప్రధానిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్, గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌తో పాటు విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై ప్రధాని మోదీ ముందే సమాచారం పొంది ఉండటంతోనే.. వేదికపై పబ్లిక్‌గా లోకేశ్‌ను ప్రశంసించారని స్పష్టమవుతోంది. ఇది ఒక యువ నాయకుడి కష్టానికి, పారదర్శక కార్యాచరణకు దక్కిన ప్రతిఫలం అనుకోవచ్చు. వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించే ప్రధాని మోదీ గతంలో లోకేష్ ను కూడా విమర్శించారు. కానీ ఇప్పుడు అభినందిస్తున్నారు. ప్రధాని శభాష్ అని అనడం వెనుక లోకేశ్ సొంతంగా సంపాదించుకున్న గుర్తింపే ప్రధాన కారణం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల వికాస శాఖల మంత్రిగా గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడంలో లోకేశ్ నిరంతరం విదేశీ ప్రతినిధులతో సమావేశమవుతూ చురుగ్గా పనిచేస్తున్నారు. పెట్టుబడుల సేకరణ, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పనలో ఆయన చూపుతున్న వేగం జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశమైంది. మరోవైపు విపక్షాలు చేసే రాజకీయ విమర్శలకు సైతం లోకేశ్ ఇప్పుడు సంయమనంతో, సమాచార ఆధారిత సమాధానాలు ఇస్తూ ఒక సీనియర్ స్టేట్స్‌మన్‌లా వ్యవహరిస్తున్నారు. పార్టీలో తండ్రి చంద్రబాబు నాయుడి పక్కన ఒక బలమైన రెండో శ్రేణి నాయకత్వంగా నిలబడటమే కాకుండా, ఎన్డీయే కూటమి సమన్వయంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. పవన్ కల్యాణ్ వంటి జనసేన అధినేతతో, బిజెపి కేంద్ర నాయకత్వంతో సౌహార్ద్రపూర్వక సంబంధాలను నిర్వహిస్తూ కూటమికి బలమైన ఆధారంగా నిలిచారు. సొంత ప్రయాణంలో తండ్రి నీడ నుంచి బయటకు వచ్చి, తనదైన శైలిలో పాలన సాగిస్తూ, శభాష్ అని ప్రధాని చేత పటించుకోవడం ఒక యువ నేతకు అతిపెద్ద పొలిటికల్ మైలురాయి. దేశంలోనే అత్యంత ప్రామిసింగ్ యంగ్ పొలిటీషియన్లలో ఒకరిగా ఎదిగిన లోకేశ్‌కు ప్రధాని ఇచ్చిన ఈ బూస్ట్, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, విద్యా వికాసంలో మరింత వేగాన్ని నింపడమే కాక.. జాతీయ స్థాయిలో ఆయన ప్రాధాన్యతను మరింత పెంచనుందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎలా ఎదిగాడో...దానికి డబుల్ స్పీడ్ లో...



### దిగజారిన ఉదయ్ కృష్ణారెడ్డి

ఒంగోలు, ఆగస్టు 6, ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కష్టపడి పైకి వచ్చారు. ఎంత వేగంగా ఎదిగారో.. అంతే స్పీడ్ గా పతనమయ్యారు. ఒక బలహీనత ఆయన కెరీర్ ను ప్రమాదంలోకి నెట్టేసింది. మహిళలతో సంబంధాల కోసం ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ ఉద్యోగానికే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు పోలీసుల విచారణతో వెదలయింది. ట్రెయినీ మహిళ ఐపీఎస్ తో మాత్రమే కాకుండా మరో మహిళతోనూ వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడయింది. తమ ప్రాంతానికి చెందిన మహిళ హైదరాబాద్ లో ఉండటం, ఆమెను లోబర్చుకున్నారన్న ఆరోపణలు ఉదయ్ కృష్ణారెడ్డిపై వినిపిస్తున్నాయి.... ట్రయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కీలక పురోగతి కనిపిస్తుంది. ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో కత్తి, రెండు ప్రేమలేఖలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వివాహితతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలిని కలిసిన తర్వాత ఉదయ్‌కు వివాహిత దూరమైనట్లు కూడా కనుగొన్నారు. తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి... కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఒక కత్తి, వేర్వేరు చేతిరాతలతో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖల ఆధారంగా ఆరా తీయగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వివాహితతో ఉదయ్‌కు సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2014లో వివాహమైన సదరు మహిళ, 2023 నుంచి భర్తకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆమెకు ఉదయ్‌తో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఉదయ్ సూచన మేరకే ఆ మహిళ తన పాత ఉద్యోగాన్ని వదిలేసి, అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉందామని ఉదయ్ ప్రతిపాదించగా, చట్టబద్ధంగా విడాకులు రాకపోవడంతో ఆమె నిరాకరించినట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలకమైన విషయం ఏమిటంటే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితురాలైన ట్రెయినీ ఐపీఎస్ అధికారిణిఆ వివాహితను కలిసి ఉదయ్ కృష్ణారెడ్డి విపరీత ప్రవర్తన, తనపై జరిపిన దాడుల గురించి వివరించారు. దీంతో అతడి నిజస్వరూపం తెలుసుకున్న ఆ మహిళ, అప్పటి నుంచి ఉదయ్‌కు దూరంగా ఉంటున్నట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. బాధితురాలి గదిలోకి ఉదయ్ బలవంతంగా ప్రవేశించి ఆమె ఫోన్‌ను లాక్కున్నట్లు కూడా పోలీసులకు బలమైన ఆధారాలు లభించాయి. శిక్షణ సమయంలోనూ ఉదయ్ కృష్ణారెడ్డి అతి కోపం, ప్రవర్తన కారణంగా తోటి అధికారులు మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. ఈ కేసులో భాగంగా పోలీసులు ఇప్పటివరకు దాదాపు 20 మంది నుంచి వాంగ్మూలాలు సేకరించారు

## ఆషాడ మాస శుక్రవారం సందర్భంగా మహాగౌరీ అమ్మవారికి విశేష పూజలు..



విభారే న్యూస్ ఆగస్టు 06 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ మాత్రేనమః శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో నేడు ఉదయం 9:30 నిమిషాలకు ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ మహా గౌరీ అమ్మవారికి శాకాంబరి అలంకరణ, శ్రీదేవి ఖడ్గమాల, శ్రీ లలితా సహస్రనామ, శ్రీ లలితా త్రిశతి, శ్రీ అన్నపూర్ణ అష్టోత్తర పూర్వక లక్ష కుంకుమార్చన జరుపబడును. భక్తులు యధా శక్తిగా ఈ కార్యక్రమంలో ధన రూపేణ విరాళం ఇచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు.వివరములకు సంప్రదించవలసిన నెం :- లక్ష్మి నరసింహ శర్మ గారు 8008774086గూగుల్ పే ఫోన్ పే నెంబర్.. 8896123777

## సి.బెలగల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్.



విభారే న్యూస్ ఆగస్టు 06 కర్నూలు జిల్లా ప్రతినిధి..మహిళలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందించాలి.మహిళల భద్రత, బాల్యవివాహాల నిర్మూలనకు, సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.గురువారం సి.బెలగల్ పోలీసు స్టేషన్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, నిందితుల అరెస్టులు,దర్యాప్తు స్థితిగతులను సమీక్షించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.అలాగే ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించి రికవరీలు చేపట్టాలని సూచించారు.ప్రజల్లో భద్రతాభావం పెంపొందేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర సేవలు అందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.మహిళలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అలాంటి ఘటనలను అడ్డుకోవాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు సకాలంలో స్పందించి, నష్టపోయిన సొమ్ము తిరిగి పొందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.కర్నూలు ఎస్పీ తో పాటు కోడుమూరు సీఐ తబ్రేజ్, సి.బెలగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.

## నేడు కృత్తికా నక్షత్రం సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు..

విభారే న్యూస్ ఆగస్టు 06 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురు దత్త శ్రీ గురు దత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో నేడు స్వామి వారి జన్మ నక్షత్రం అయిన కృత్తిక(ఆడి కృత్తిక) ఉన్న శుభ సందర్భంగా శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషంగా పూజలు,కావడి సేవలు, అర్చనలు,సర్ప సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు, కందుల హారతులు జరుగును. ఈ రోజు విశేషంగా స్వామి వారిని ఆరాధిస్తారు. కావడి సేవ స్వామి వారికి అత్యంత ప్రియమైనది. వివాహ సమస్యలు, భూ సమస్యలు, సంతాన సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన ద్వారా తమ సమస్యలను దూరం చేసుకోగలరు..



కావడి సేవ -250/-పంచామృత అభిషేకం - 200/-మాసపూజ - 300/-నిత్య పూజ - 3000/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ - 7995202082దేవాలయం గూగుల్ పే ఫోన్ పే నెంబరు..8896123777 ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388

## శాకంబరి అలంకారానికి మార్కెట్ ప్రసాద్‌కు అవకాశం--

### శ్రీశైలం దేవస్థానం ప్రత్యేక అనుమతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6: ఆషాఢ మాసం సందర్భంగా శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆగస్టు 7న శ్రీ కొలను భారతి (సరస్వతీ దేవి) అమ్మవారికి నిర్వహించనున్న శాకంబరి అలంకారం కోసం అవసరమైన కూరగాయలు, పండ్లు, ఫలాలు, పూజా ద్రవ్యాలను సమర్పించేందుకు



నంద్యాల మార్కెట్ ప్రసాద్‌కు దేవస్థానం ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది. ఈ విషయాన్ని దేవస్థానం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. శాకంబరి అలంకారానికి అవసరమైన కూరగాయలు, పండ్లు, పూజా సామగ్రిని సమకూర్చి ఆలయ అర్చకులకు అందజేసే బాధ్యతను మార్కెట్ ప్రసాద్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. అమ్మవారికి శాకంబరి అలంకారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలోనే సంప్రదాయబద్ధంగా నిర్వహించబడుతుందని, అలంకారానికి అవసరమైన కూరగాయలు, పండ్లు, పూజా ద్రవ్యాలను ఆగస్టు 6 ఉదయం లోపు ఆలయ అర్చకులకు అందజేయాలని దేవస్థానం సూచించింది. ఈ పుణ్యకార్యంలో భాగస్వాములై అమ్మవారి కృపాకటాక్షాలను పొందాలని భక్తులను కోరింది.ఆషాఢ మాసంలో అత్యంత విశిష్టంగా నిర్వహించే ఈ శాకంబరి అలంకారంలో నంద్యాల మార్కెట్ ప్రసాద్‌కు దేవస్థానం ప్రత్యేక బాధ్యత అప్పగించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## దొంగతనం కేసు ఛేదన

### :- అంతరాష్ట్ర దొంగ అరెస్ట్---

### రూ.15 లక్షల విలువైన 115 గ్రాముల బంగారం స్వాధీనం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఆగస్టు 6: నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదైన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి, అంతరాష్ట్ర దొంగను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన 115 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.2025 మార్చి 7న శివసాయి గార్డెన్‌లోని ఓ ఇంటిలో జరిగిన చోరీపై నమోదైన కేసులో, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఆదేశాల మేరకు, ఏఎస్పీ సుస్మిత పర్యవేక్షణలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. గురువారం రైతునగర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, కేసులో తన ప్రమేయాన్ని అంగీకరించాడు.అరెస్టు అయిన నిందితుడు కర్ణాటక రాష్ట్రం ఉత్తర కన్నడ జిల్లా దండేలికి చెందిన జాఫర్ అలీ మహమ్మద్ హనీఫ్ సాగర్ (36)గా పోలీసులు గుర్తించారు. మరో




నిందితుడు మృతిచెందగా, ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.ఈ కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న సీఐ ఆర్. ఈశ్వరయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి. సురేష్ కుమార్‌తో పాటు పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

## బలపనూరు పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్--

### లీప్ యాప్‌లో సకాలంలో వివరాలు నమోదు చేయాలని ఆదేశం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6:పాణ్యం మండలం బలపనూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, విద్యా



బోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, లీప్ యాప్‌లో నమోదవుతున్న వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.లీప్ యాప్‌లో విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాలను ఖచ్చితంగా, సకాలంలో నమోదు చేయాలని, డ్రాపౌట్‌ల నివారణ, అవుట్ ఆఫ్ స్కూల్ పిల్లల గుర్తింపు, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆహార నాణ్యత, పరిశుభ్రతపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యా ప్రమాణాలు, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల అమలులో నిర్లక్ష్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఇంటి స్థలాల కోసం 17న కలెక్టరేట్ ముట్టడి--

### పేదలకు స్థలాలు ఇచ్చే వరకు పోరాటం: సిపిఐ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6:సిపిఐ ఆధ్వర్యంలో గురువారం నంద్యాల పట్టణంలోని నూనెపల్లె, ఏకలవ్య నగర్, ఆచారి కాలనీ, మారుతి నగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ, అర్హులైన పేదలకు వెంటనే ఇంటి స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇంటి స్థలాలు మంజూరు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని, ఈ నెల 17న ఇంటి స్థలాల అర్జీదారులతో కలిసి కలెక్టరేట్ వద్ద భారీ ఆందోళన చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో సిపిఐ, రైతు సంఘం, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నవ నరసింహ ప్రతిష్ఠకు ఘన ఏర్పాట్లు--

### ఆగస్టు 29 నుంచి మూడు రోజుల మహోత్సవం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 06-నంద్యాల పట్టణంలోని తెలుగుపేట శ్రీ ఘన మద్దులేటి లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంలో ఆగస్టు 29, 30, 31 తేదీలలో మూడు రోజులపాటు నవ నరసింహ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ, సుదర్శన చక్రం, పెరుమాళ్ చర ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.భగవత్ సంకల్పంతో, శ్రీ మద్దులేటి లక్ష్మి నృసింహ స్వామివారి అనుగ్రహం, భక్తులు, దాతల సహకారంతో ఈ మహోత్సవాలను శ్రీ వైష్ణవ ఆగమ శాస్త్ర సంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ మహోత్సవాలకు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారు మరియు అహోబిల జీయర్ స్వామివారు మంగళాశాసనాలు అందించడం విశేషమని తెలిపారు. వారి ఆశీస్సులతో జరిగే ఈ ప్రతిష్ఠా మహోత్సవాలు భక్తులకు అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తాయని పేర్కొన్నారు.మూడు రోజులపాటు వేద పండితుల ఆధ్వర్యంలో యాగశాల పూజలు, హోమాలు, కలశస్థాపన, ప్రత్యేక ఆరాధనలు, ప్రతిష్ఠా క్రతువులు, స్వామివారి విశేష సేవలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ మహోత్సవాల్లో నంద్యాల జిల్లా, పరిసర ప్రాంతాల భక్తులు



పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయల్ విజ్ఞప్తి చేశారు. అన్ని ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

## గోపాలరావుపై ఏసీబీ దాడులు--

### కర్నూలు, నంద్యాలలో ఏకకాలంలో సోదాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 06-నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గోపాలరావుపై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే సమాచారంతో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. నంద్యాలతో పాటు కర్నూలులోని ఆయన నివాసం, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు.తనిఖీల్లో విలువైన పత్రాలు, హోమ్ థియేటర్, బంగారం, వెండి ఆభరణాలు లభించినట్లు సమాచారం. కర్నూలులో మూడు విలాసవంతమైన భవనాలు, ఐదు



ఖాళీ స్థలాలను అధికారులు గుర్తించి వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నారు.స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## రైతన్న గడపకు వ్యవసాయ బృందాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఆగస్టు 6: నంద్యాల మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రైతు సేవా సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట యాజమాన్యంపై సూచనలు అందిస్తారు. సాగులో ఉన్న పంటలను పరిశీలించి అవసరమైన సలహాలు ఇవ్వడంతో పాటు, నమోదు కాని పంటల నమోదు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ శాఖ సాంకేతిక అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## రైతు నగర్‌లో కమిషనర్ తనిఖీ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6:నంద్యాల పట్టణంలోని 22వ వార్డు రైతు నగర్‌లో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న గురువారం పారిశుధ్య పనులను ఆకస్మికంగా పరిశీలించారు. వీధుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణను పరిశీలించి పనులు నిరంతరం నాణ్యతతో సాగాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. చెత్త ఎక్కడా పేరుకుపోకుండా సకాలంలో తొలగించాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పారిశుధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ దీక్షలు

### --మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని శిల్పా, ఇసాక్ భాషా డిమాండ్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 6: నంద్యాల గాంధీచౌక్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు, విద్యార్థులకు మద్దతుగా నాలుగు రోజుల రిలే నిరాహార దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ భాషా దీక్షలను ప్రారంభించి మాట్లాడారు.డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని, ఎంపిక ప్రక్రియపై సీబీఐతో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ



వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల హామీలైన నిరుద్యోగ భృతి అమలు కాలేదని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తెలిపారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**